క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 31 కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలకు నిధుల లోటు రాకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రావు, కాశీనాథ్‌యాదవ్, మోజెస్, కిషన్, రాము, శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ పెయింటింగ్ పోటీలు



పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ అండ్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ మణిభూషణ్ చారి, హెచ్ఎం కిషన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రేషన్ రాజులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

నిజాంపేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి అన్నారు. కావ్య అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కార్పొరేటర్‌ను కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా నూతన పనులను చేపట్టాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను మొదలుపెడతామని.. కాలనీవాసులకు ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు విజయ్, ప్రసన్నబాబు, భరత్, మురళి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి




కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కోరారు.డివిజన్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రంలో బుధవారం ఆయన కంటి పరీక్ష చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని అంధత్వ నివారణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ డీసీ రవీందర్, ఎస్ఆర్‌పీ వినయ్‌కాంత్‌రెడ్డి, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి..

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబూరావు పరిశీలించారు. వైద్యులు ప్రతిభ, సీఓ సురేష్‌తో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు నిరుపేదలు ఎంతో ఉపయోగకరమన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి వేదిక అని పేర్కొన్నారు.



బాలాజీనగర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఇళ్ల మధ్య నుంచి పారుతున్న మురుగు
- భరించలేని దుర్వాసన
- దుర్గంధంతో ఇబ్బందులు
- పెరిగిన దోమల బెడద
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



దోమలకు ఆవాసంగా మారిన పరికి చెరువు



తులసీనగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

ఆల్విన్‌కాలనీ: పల్లెల్లోనూ సైతం అన్ని రకాల మౌలిక వసతులతో నగరాలను తలపించేలా తీర్చిదిద్దుతున్నారు. హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఆల్విన్‌కాలనీలోని తులసీనగర్ వాసులు అస్తవ్యస్త డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల సముదాయాల వద్ద డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. దానికి తోడు స్థానికంగా ఉన్న బస్తీలోని మురుగు సైతం డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో మురుగు ఇళ్ల మధ్య నుంచి పారుతోంది.

గుర్రపుడెక్క తొలగింపు నిరంతర ప్రక్రియ అంటున్న వైనం

పరికి చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు కుట్టడంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పరికి చెరువులో గుర్రపుడెక్క తొలగించడానికి కరోనా కంటే ముందే టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు కాలయాపన చేస్తూ తీసిన గుర్రపుడెక్కను అక్కడే గట్టుపై పడేస్తుండటంతో అదే గుర్రపుడెక్క మళ్లీ వృద్ధి చెంది చెరువు అంతా విస్తరిస్తోంది. నెలలు గడుస్తున్నా చెరువును మాత్రం పూర్తి స్థాయిలో ఇప్పటివరకు గుర్రపు డెక్కను తొలగించలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇది నిరంతర ప్రక్రియ అని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

కలగానే మినీ ట్యాంక్‌బండ్..

మిషన్ భగీరథ ద్వారా పరికి చెరువును శుద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామన్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిందని పేర్కొంటున్నారు. దీంతో తులసీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి...

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువులు, ఓపెన్ నాలాల పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరుతున్నారు. అదే విధంగా మార్కెట్ ప్రాంతాలు, మురికి కూపంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లపై మురుగు..



ఓపెన్ నాలాలో వ్యర్థాలు పేరుకు పోయాయి. మురుగు రోడ్లపై పారుతోంది. జేఎన్ఎన్‌యూఆర్ఎం వద్ద డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పరికి చెరువులో గుర్రపుడెక్కతో దోమలు వృద్ధి చెంది దండయాత్ర చేస్తున్నాయి. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– శంకర్‌రావు, తులసీనగర్

ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం..



దోమల నివారణకు ప్రతి కాలనీ, చెరువు పరిసరాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. చెరువుల్లో డ్రోన్ల ద్వారా దోమల నివారణ మందును పిచికారి చేస్తున్నాం. ప్రతి ఇంటికి ఎంటమాలజీ సిబ్బందిని పంపించి దోమల మందును పిచికారి చేయిస్తున్నాం. ప్రజలు దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలి.

– ఉషారాణి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్, కూకట్‌పల్లి

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



హైదర్‌నగర్ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ కాలనీ, సమతనగర్, హెచ్ఎంటీ హిల్స్ కాలనీలో రూ.1.48లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లో సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అగ్రగామి నియోజవకర్గంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. బస్తీలు, కాలనీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రెండు దశాబ్దాలుగా భాషాపండితులకు పదోన్నతులు లేవు'



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న భాషా పండితులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న భాషా పండితులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అప్‌గ్రేడ్ అయినటువంటి పోస్టుల్లో భాషా పండితులను పదోన్నతులు ద్వారా అవకాశం కల్పించటానికి గతంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ... 20 ఏళ్లుగా పండితులు పదోన్నతులకు నోచుకోలేదన్నారు. భాషాపండితుల, పీఈటీల పదోన్నతుల ఆకాంక్ష నెరవేరేందుకు చేరేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇక ముందు దశలవారీగా చేపట్టే నిరసన కార్యక్రమాలకు కూడా సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు స్వప్న, జిల్లా సమన్వయ సహ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, రామచందర్, ఎల్లమ్మ బండ సీనియర్ భాషా పండితులు చంద్రశేఖర్, మాణిక్యం, జిల్లా మహిళా కార్యదర్శి సాయిగీతిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం



మూసాపేటలో జరిగిన సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్, మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్‌లో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల భేటీని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. బీజేపీ అధిష్టానం సైతం తెలంగాణపై మరింత ఫోకస్ పెంచిందని పేర్కొన్నారు. బూత్ అధ్యక్షులకు ఆయన కీలక సూచనలు చేశారు. కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు బూత్ అధ్యక్షులు విధి విధానాలు వివరించారు. అనంతరం బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, పలువురు నేతలతో కలిసి పోలింగ్ బూత్ అధ్యక్షుడి పేరుతో తయారు చేయించిన బోర్డును బూత్ అధ్యక్షుల ఇళ్లకు అమర్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు వినోద్‌కుమార్, శైలేష్‌కుమార్, జిల్లా నాయకులు డాకయ్య, కృష్ణ ముదిరాజ్, మల్లేష్, మాణిక్, యాదగిరి, మంగమ్మ, సతీష్, సాయి, శ్రీను, కిషోర్, అబ్బాస్, రవిగౌడ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికే పెద్దపీట



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: నియోజకవర్గ అభివృద్ధికే పెద్దపీట వేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఎల్‌బీ నగర్‌లో రూ.21.40 లక్షలలు, ఎస్సీబస్తీలో రూ.20.40 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. హస్మత్‌పేట బోయిన్‌చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. చెరువును సుందరీకరించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, నాయకులు పాల్గొన్నారు.

న్యాక్ మెయిల్స్‌కు స్పందించాలి

మూసాపేట: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం న్యాక్ అక్రెడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ కోరారు. న్యాక్ అక్రెడిటేషన్ అసెస్‌మెంట్‌లో భాగంగా న్యాక్ నుంచి 20 ప్రశ్నలతో కూడిన మెయిల్ వస్తుందన్నారు. విద్యార్థులు ఆ మెయిల్స్‌కు తక్షణం స్పందించి జవాబులు పంపించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా అభ్యాసక సహాయ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

సత్తాచాటిన జగన్ ఫిట్‌నెస్ రన్నర్స్ టీమ్



మూసాపేట: మెదక్‌లో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జగన్ ఫిట్‌నెస్ రన్నర్స్ కోచ్ జగన్‌మోహన్‌రెడ్డి 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. సతీష్ మొవ్వ 800 మీటర్లు, 5కే, 10కే రన్‌లలో గోల్డ్‌మెడల్, రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌తో సత్తాచాటారు. శ్రీనివాస్ రాజు 5కే, 800 మీటర్లు పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్, సుధాకర్ 5కే, 10కే, 1500 మీటర్ల పందెంలో రెండు గోల్డ్ మెడల్స్, ఒకటి బ్రాంజ్, కమల 5కే, 400, 800 మీటర్లలో రెండు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించటం సంతోషంగా ఉందని క్రీడాకారులు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద ఉన్న స్పోర్ట్స్ సెంటర్‌లో బుధవారం మెడల్స్ సాధించిన అథ్లెట్స్‌ను సత్కరించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో ఎస్.సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్లౌజ్ డిజైన్స్, జ్యూట్ బ్యాగ్ తయారీ, మగ్గం వర్కు, ఎంఎస్ ఆఫీస్‌లో స్వయం ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణకు మహిళలు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఫొటో, ఆధార్‌కార్డుతో పై తెలిపిన కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.30గంటలలోపు సంప్రదించాలని కోరారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఫోన్ నం.93961 61936.

నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో బుధవారం రూ.55లక్షలతో సఫ్దార్‌నగర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమీద్ సలీం బాబా, మహమ్మద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

- అమాయకుల నుంచి రూ.కోట్లలో వసూళ్లు
- రియల్టర్ అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లను తక్కువ ధరలకు ఇస్తామని ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మొఖం చాటేసిన ఓ రియల్‌ఎస్టేట్ సంస్థ యజమానిని కేపీహెచ్‌బీ పోలీసులు బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సీఐ కిషన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. హైదర్‌నగర్‌లోని పీఎస్ఆర్ హైట్స్‌లో నివాసం ఉండే కాకర్ల శ్రీనివాస్ జయత్రీ రిలయబిలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్‌ఎస్టేట్ సంస్థను ఏర్పాటు చేశారు. కేపీహెచ్‌బీ కాలనీతో పాటు పలు చోట్ల కార్యాలయాలు తెరిచారు. రియల్‌ఎస్టేట్ ఏజెంట్ల ద్వారా హైదరాబాద్ నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో వెంచర్లను నిర్మిస్తున్నట్లు, అందులో ప్రీలాంచ్ ఆఫర్ ద్వారా ముందుగా బుక్ చేసుకున్న వాళ్లకు తక్కువ ధరలకే ఇళ్ల స్థలాలు, అపార్టుమెంట్ ఫ్లాట్స్ ఇస్తామని నమ్మించి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. ఇదే కోవలో పాటిఘనపూర్, అమీన్‌పూర్, చందానగర్, నిజాంపేట, తోల్‌కట్టా, సదాశివపేట, షాద్‌నగర్, రాయదుర్గం, లింగంపల్లి, సర్దార్‌పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, అపార్టుమెంట్లను నిర్మిస్తున్నట్లు పేద, మధ్యతరగతి వర్గాలను నమ్మించి డబ్బులు వసూలు చేశారు. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్ద , గోపన్‌పల్లి కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఉన్న స్టాల్స్‌ను కేటాయిస్తామని నమ్మించడంతో మహదేవపురానికి చెందిన రావి శ్రీకాంత్‌తో పాటు అతని స్నేహితులు గుడిపూడి పూర్ణచందర్‌రావు, కామినేని వెంకటేష్, తోట అర్చన, పందిరి నమ్రతలు ఒక్కొక్కరు రూ.పది లక్షల చొప్పున కాకర్ల శ్రీనివాస్‌కు చెల్లించారు. ఇలా చాలా మంది నుంచి సుమారు రూ.20 కోట్ల వరకు కాకర్ల శ్రీనివాస్‌తో పాటు అతని అనుచరులు బొల్లా శ్రీనివాసరావు, మునీశ్వర్, శ్రీనివాస్‌లు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే 8 మంది బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు కాకర్ల శ్రీనివాస్‌ను బుధవారం అతని నివాసం వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఏసీపీ చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. కాగా జయత్రీ ఇన్‌ఫ్రా, జయత్రీ రిలయబిలిటీస్ పేరుతో ఏవరైనా మోసపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఏసీపీ చంద్రశేఖర్ సూచించారు.

రాజ్యాంగం ఇచ్చిన వజ్రాయుధం ఓటు

ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ రూపొందించిన పాట, ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ, డీసీ రవికుమార్, ఏఈఆర్ఓ, డీసీ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ... ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండాలంటే సమర్థవంతులైన నాయకుడిని ఎన్నుకోవటం ఓటు ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవటం మన కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ సూపర్‌వైజర్లు సందేష్, జవహర్ నాయక్, ప్రభాకర్, రమేష్, కిరణ్, ప్రిన్సిపాల్ భవాని, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ అవగాహన ర్యాలీలో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



శ్రీసాయి విద్యానికేతన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలలో...

కేపీహెచ్‌బీకాలనీ: హైదర్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల బాలానగర్ బాయ్స్–1లో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డా. కల్పన మాట్లాడుతూ.. ఒక ఓటు నిర్లక్ష్యమైనా ప్రజాసామ్యానికి చాలా ప్రమాదకరమన్నారు. బుల్లెట్ కన్నా బ్యాలెట్ ప్రధానమైనదని అన్నారు. ఓటు వజ్రాయుధం అని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు షాహీన్, పకీరప్ప పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో...

మూసాపేట: మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో బుధవారం జాతీయ ఓటర్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి ఓటు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు ఆవశ్యకతను స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు.